నేడు కొప్పుల ఈశ్వర్ బెల్లంపల్లికి రాక

బెల్లంపల్లి/నెన్నెల, కాసిపేట, మార్చి 13 : బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం బెల్లంపల్లికి రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆయా మండలాల అధ్యక్షులు తెలిపారు. ఉదయం 9:30 గంటలకు బెల్లంపల్లి, 11 గంటలకు కాసిపేట, 12 గంటలకు తాండూర్, మధ్యాహ్నం 3 గంటలకు నెన్నెల, 4 గంటలకు కన్నెపల్లి, భీమిని మండలాల నాయకులతో ఏర్పాటు చేసే సమీక్షా సమావేశంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ మేళా

చెన్నూర్, మార్చి 13: చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో వారంలో మూడు రోజుల పాటు రెవెన్యూ మేళాను నిర్వహిస్తున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంలో ప్రతి ఆది, మంగళ, గురువారాల్లో ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు రెవెన్యూ మేళాను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు మున్సిపాలిటీలో రెవెన్యూ విభాగానికి సంబంధించిన సమస్యల గురించి దరఖాస్తు చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

భీమారం, మార్చి 13 : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఎంపీడీవో రాధారాథోడ్ సూచించారు. బూర్గుపల్లి, కాజీపల్లి, దాంపూర్, ధర్మారం, నర్సింగాపూర్ గ్రామాల్లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కాజీపల్లిలో గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సతీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు అదనపు కౌంటర్ ప్రారంభం

బెల్లంపల్లి, మార్చి 13 : మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో అదనపు కౌంటర్‌ను ప్రారంభించారు. ఒకే కౌంటర్ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

కాసిపేట, మార్చి 13 : కాసిపేట మండలంలోని రొట్టెపల్లి చౌడుగూడకు చెందిన కుర్సింగ అజయ్(18) మానసిక స్థితి సరిగ్గా లేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... అజయ్ మేకల కాపరిగా పని చేస్తుండగా మానసిక పరిస్థితి సరిగ్గా ఉండేది కాదని, గతంలో మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్లు వివరించారు. మంగళవారం మేకలు కాయడానికి వెళ్లి వచ్చి ఇంటి వద్ద దొడ్డిలో మేకలు వదిలిపెట్టి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం అజయ్ పత్తి చేనులో తునికి చెట్టుకు చీరతో ఉరి వేసుకొని ఉండడాన్ని అజయ్ తండ్రి మహదు గమనించి బతికే ఉన్నాడనుకొని అటువైపు వెళ్తున్న వారిని పిలిచి చీరను విప్పి కిందకు దించగా అప్పుడికే మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు తండ్రి మహాదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైడ్ విరాళం

తాండూర్, మార్చి 13 : మండలంలోని చౌటపల్లి గ్రామంలో పాఠశాలకు టాటా సోలార్ కంపెనీ వారు రూ. 2లక్షల విలువగల ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంక్, సిస్టమ్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం, ప్రతినిధులలకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు శేఖర్, కుమార్, సురేశ్, ప్రవీణ్, రామకృష్ణ, శంకర్, అషుమ్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కపీ విశ్వనాథం, ఉపాధ్యాయులు చక్రపాణి, దేవదాస్, నాయకులు చీమల శంకర్, ముదాం రఘు, చీమల మహేశ్, ఎనగందుల నరేశ్, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు

బంగారు భవిష్యత్‌కు 'పది' తొలిమెట్టు

- మంచిర్యాల డీఈవో యాదయ్య
- పలు పాఠశాలలో ఫేర్‌వెల్ వేడుకలు

సీసీసీ నస్పూర్, మార్చి 13: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు టెన్త్‌క్లాస్ తొలిమెట్టు అని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సీసీసీ నస్పూర్ రేడియంట్ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ ఇటీవల నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్‌లో నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవాన్ని బుధవారం రేడియంట్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో యాదయ్య హాజరై మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష లంటే భయాన్ని వీడాలని, కష్టపడి చదివితే సులువుగా ఎదుర్కొనవచ్చని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో సింగరేణి హైస్కూల్‌కు చెందిన లక్ష్మీప్రసన్న, మార్టిన్ గ్రామర్ స్కూల్‌కు చెందిన అశ్విత ప్రథమ స్థానం, రేడియంట్ స్కూల్‌కు చెందిన అక్షిత ద్వితీయ స్థానం, ఎస్ఆర్ఆర్ పాఠశాలకు చెందిన మనోజ్, కేజీబీవీకి చెందిన నవ్యశ్రీ తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి డీఈవో, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ జితేందర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, మండల కార్యదర్శి ఈదునూరి అభినవ్, ఉపాధ్యక్షుడు ఎలుక అరవింద్‌రెడ్డి, నాయకులు రాము, రమేశ్, విఘ్నేశ్, వర్మ, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్ : విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఈవో యాదయ్య

పది పరీక్షలు భవిష్యత్‌ను తీర్చిదిద్దుతాయి

భీమారం, మార్చి 13 : పది పరీక్షలు భవిష్యత్ తీర్చిదిద్దుతాయని, విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని భీమారం ఇన్‌చార్జి ఎంఈవో రాధకృష్ణ విద్యార్థులకు సూచించారు. భీమారంలోని స్థానిక జడ్పీ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు, 9వ తరగతి విద్యార్థులు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈవో రాధాకృష్ణ మూర్తి పలు సూచనలు చేశారు.

ముత్యంపల్లి పాఠశాలలో..

కాసిపేట, మార్చి 13 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలను నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర స్వామి, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణగోపాల్‌రావు, జ్యోతి, మాధవి లత, అర్చన పాల్గొన్నారు.

ధర్మారావుపేట పాఠశాలలో...

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట పాఠశాలలో పదో తరగతి వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్ నాయక్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సతీశ్ కుమార్, రాజేశం, లత, తిరుపతి, భాగ్యలక్ష్మి, నజియ, సులోచన, వెంకటేశ్, సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమారం : విద్యార్థినికి బహుమతి అందజేస్తునన ఎంఈవో రాధాకృష్ణ మూర్తి

కాసిపేట : ధర్మారావు పేటలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఓరియంట్ ఆధ్వర్యంలో రూ.1.55 కోట్ల అభివృద్ధి పనులు

సాలేగూడ గ్రామంలో కొనసాగుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం

కాసిపేట, మార్చి 13 : మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో పరిసర గ్రామాల్లో రూ.1.55 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఓరియంట్ ప్రెసిడెంట్ సత్యబ్రత శర్మ, యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి మాట్లాడుతూ తుడుంగూడ, సాలేగూడెం, రేగులగూడెం, ఇప్పటిగూడెం, గట్రావ్‌పల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. తుడుంగూడలో సీసీ రోడ్లు, కల్వర్టులు, నీటి బోర్ పంపు, సాలేగూడెంలో కమ్యూనిటీ హాల్, నీటి బోర్ పంపు, ఇప్పలగూడెంలో సీసీ రోడ్డు, గట్రావ్‌పల్లిలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్ల పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి దశకు చేరాయి.

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మందమర్రి, మార్చి 13: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు మూడవ జోన్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం ముత్యాల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి పూర్తి స్థాయిలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆర్థిక సహకారాన్ని అందించగా విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలను కాలనీ వాసులు విరాళాలు సేకరించి నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ నల్లా భాగ్యలక్ష్మి, మాజీ విప్ నల్లాల ఓదెలు దంపతులు కాంగ్రెస్ నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారు సూరిబాబు, మద్ది శంకర్, పల్లె నర్సింగ్, ముస్తఫా, సీపెల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

తాండూర్, మార్చి 13 : మండలంలోని కాసిపేట గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మాణ పనులను బుధవారం ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, నాయకులు ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పు రమేశ్, నాయకులు రుకుం సంతోశ్, సుంకరి గోపి, నాయకులు, తదితరులున్నారు.

బుగ్గ రాజరాజేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.11.89 లక్షలు

బెల్లంపల్లిరూరల్, మార్చి 13: బెల్లంపల్లి మండలంలోని కన్నాల శ్రీబుగ్గ రాజరాజేశ్వర స్వామి జాతర హుండీని బుధవారం దేవాదాయశాఖ ఈవో జీ బాపిరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ మాసాడిశ్రీదేవీశ్రీరాములు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు లెక్కించారు. గత సంవత్సరం రూ 10,98,766 లక్షల ఆదాయం రాగా ఈ సారి రూ 11,89,724 లక్షల ఆదాయం చేకూరింది. ఈ సారి జాతర ద్వారా దేవాదాయశాఖకు రూ 90958 వేల ఆదాయం పెరిగినట్లు ఈవో జీ బాపిరెడ్డి తెలిపారు. ఈ జాతరలో అభిషేకం ద్వారా రూ 16,800 , బహిరంగ వేలం ద్వారా రూ 5,23,500, దర్శనం టికెట్ల ద్వారా రూ 2,46000, కల్యాణ కట్నాల ద్వారా రూ 24170, హుండీ ద్వారా రూ 3,79,254 ఆదాయం చేకూరినట్లు ఆయన తెలిపారు. తాళ్ల గురిజాల ఏఎస్ఐ రాజన్న బందోబస్తు కల్పించారు.

టీఎన్జీవో నూతన కార్యవర్గం

ఎన్నికైన కార్యవర్గాన్ని సన్మానించిన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

హాజీపూర్, మార్చి 13 : మంచిర్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘ భవనంలో గృహ సంక్షేమ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు గౌస్ అహ్మద్, కార్యదర్శి మాదవ్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల అధికారిగా గడియారం శ్రీహరి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా మొహిసిన్ అహ్మద్, కార్యదర్శిగా కే శ్రీనివాస్, కోశాధికారిగా ఎన్ మల్లేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా బీ శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సుధాలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా విజయలక్ష్మి, సరిత, పబ్లిసిటీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నూర్జాహాన్, సునీత, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, సుభద్ర, ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

లక్షెట్టిపేట, మార్చి 13: లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధరణికోట వేణుగోపాల్, సూరనేని గంగాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్టీయూ పోరాడుతుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని తిమ్మాపూర్, జెండా వెంకటాపూర్ పాఠశాలల్లో పనిచేస్తున్న పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు శైలజ, అధ్యక్షుడు రవికాంత్, కొత్త సురేశ్, బైరి రామన్న, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే

సూపర్‌వైజర్లను సన్మానిస్తున్న ఐఆర్‌సీఎస్ సభ్యులు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 13: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త నిధి కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కే.మాధవి, టీ.విజయ్, కే.రవి వర్మ, ఆర్.శ్రీనివాస్ , సాయి లక్ష్మి, వేణు, ప్రణయ్, శైలజ, రాజకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ కే భాస్కర్ రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్, స్టేట్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు వీ మధుసూదన్ రెడ్డి, సభ్యులు ఎం.సత్యనారాయణ రెడ్డి, శంకర్ వర్మ, కిషన్, డాక్టర్ వంశీ పేథాలజిస్ట్, సిబ్బంది పాల్గొన్నారు .

గుడుంబా పట్టివేత

చెన్నూర్ రూరల్, మార్చి 13: చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలో 30 లీటర్ల గుడుంబాను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకునట్లు టాస్క్ ఫోర్స్ సీఐ సంజయ్ తెలిపారు. కిష్టంపేటలో ఓ ఇంట్లో గుడుంబాను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా ఇంట్లో అక్రమంగా 30 లీటర్ల గుడుంబా నిల్వ ఉందని తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ సంజయ్ తెలిపారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ లచ్చన్న, సిబ్బంది శ్రీను, రాజు, తిరుపతి, చెన్నూర్ బ్లూకోల్ట్స్ జే మల్లేశ్ పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ

- నిలిచిన రైళ్ల రాకపోకలు
- యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

మందమర్రి, మార్చి 13: మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలోని నార్లాపూర్ రైల్వే గేటు వద్ద జాతీయ రైల్వేట్రాక్‌పై విద్యుత్ తీగ(ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ వైర్) తెగి పడడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక కాగజ్‌నగర్ నుంచి కాజీపేట వైపు గూడ్స్ రైలు వెళ్తున్న సమయంలో విద్యుత్ వైరు తెగి పడింది. దీంతో రెండు రైల్వే ట్రాక్‌ల పై మంటలు చెలరేగాయి. విద్యుత్ తీగ తెగి పడడాన్ని గమనించిన గూడ్స్ రైలు లోకో పైలెట్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. బుధవారం తెల్లవారుజాము వరకు విద్యుత్ లైన్ మరమ్మతులు పూర్తి చేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. దీని మూలంగా కాగజ్‌నగర్ వైపు వెళ్లే రాయపూర్, దర్భాంగ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయాయి. అలాగే కాజీపేట వైపు వెళ్లే దానాపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు గూడ్స్ రైళ్లు బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయాయి. సుమారు నాలుగు గంటల పాటు రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- ప్రజా సంఘాలు, బీఆర్ఎస్ నాయకులు, విలేకరుల డిమాండ్
- చెన్నూర్‌లో ధర్నా

చెన్నూర్, మార్చి 13: ప్రజా జ్యోతి విలేకరి వెంకట్రాజంపై జరిగిన దాడికి నిరసనగా పలువురు బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు చెన్నూర్ పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. దాడి జరిగి మూడు రోజులైనా నిందితులను ఇంతవరకు పోలీసులు అరెస్ట్ చేయలేదని, ఇప్పటికైనా అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీను, బీఆర్ఎస్ నాయకులు సాధనబోయిన కృష్ణ, మహేందర్, మేడ సురేశ్‌రెడ్డి, నెన్నల భీమయ్య, ఏడీజేఎఫ్ జాతీయ అధ్యక్షుడు రాజ్ ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, సీపీఐ, సీపీఎం పార్టీల అనుబంధ సంఘాల నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

విలేకరి దాడి కేసులో దర్యాప్తు వేగవంతం చేయండి

- చెన్నూర్ పోలీసులకు జైపూర్ ఏసీపీ మోహన్ ఆదేశం

చెన్నూర్ టౌన్, మార్చి 13 : విలేకరిపై దాడి కేసులో నిందితులను పట్టుకోవడంలో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని జైపూర్ ఏసీపీ మోహన్ సూచించారు. చెన్నూర్ పట్టణానికి చెందిన ప్రజాజ్యోతి విలేకరి వెంకటరాజుపై దాడి కేసు విషయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బుధవారం వచ్చారు. కేసు విషయంలో నిందితులను పట్టుకోవడం కోసం సీసీ కెమెరాలను చూడడం, సీడీఆర్, టవర్ డంప్ అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పట్టుకోవాలని సీఐ రవికుమార్‌కు సూచించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నిందితులు తప్పించుకోవడానికి వీలులేదని ఆదేశించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో, స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలి

కాసిపేట : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాధిక

కాసిపేట, మార్చి 13 : గర్భిణులు, బాలింతలు రక్తహీనత లేకుండా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక సూచించారు. బుధవారం కాసిపేట మండలంలోని సోనాపూర్ అంగన్ వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడలో భాగంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుశీల, ఆయా అనురాధ, తల్లులు, గర్భిణులు బాలింతులు, పిల్లలు పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్, మార్చి 13 : పోషణ పక్వాడ్‌లో భాగంగా బుధవారం మాదారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లలందరి పెరుగుదల, పర్యవేక్షణ, పోషక ప్రయోజనాలుపై తల్లులు, సంరక్షకులు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు ఐసీడీఎస్ సీడీపీవో మాస ఉమాదేవి అవగాహన కల్పించారు. రేపల్లెవాడలో చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలున్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించవద్దు

- చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్

సుంపుటంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

వేమనపల్లి, మార్చి 13 : గ్రామాల ప్రజలు అసాంఘిక శక్తులకు సహకరించవద్దని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్‌తో కలిసి సుంపుటంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలో సోదాలు నిర్వహించిన సరైన ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. ప్రాణహిత నది పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో డ్రోన్ కెమెరాతో 20 కిలోమీటర్లదూరం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందించి..దవాఖానకు తరలించి..

- ఫిట్స్ వచ్చిన ఇంటర్ విద్యార్థినిని కాపాడిన పోలీసులు

విద్యార్థినిని వాహనంలో తీసుకువచ్చి దవాఖానలోకి తీసుకెళ్తున్న ఎస్ఐ

మంచిర్యాల ఏసీసీ, మార్చి 13: మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ మోడల్ స్కూల్‌లో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాస్తున్న ప్రణీత ఆకస్మాత్తుగా పిట్స్ వచ్చి కింద పడిపోయింది. గమనించిన ఎస్ఐ రాములు వెంటనే స్పందించి తన వాహనంలో ముందుగా రాజీవ్‌నగర్ లోని హెల్త్‌కేర్ సెంటర్‌కు తీసుకవెళ్లారు. అక్కడి వైద్యాధికారి సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని జనరల్ దవాఖానకు తరలించి చికిత్స ను అందించారు. సకాలంలో స్పందించి విద్యార్థినిని కాపాడిన ఎస్ఐ రాములకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐని ఎగ్జామ్ సెంటర్ నిర్వాహకులు, అధ్యాపకులు స్థానికులు అభినందించారు.

సింగరేణి

కారుణ్య నియామకాలతో యువతకు మేలు

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి

నియామక పత్రాలు అందుకున్న వారితో జీఎం సంజీవరెడ్డి

సీసీసీ నస్పూర్, మార్చి 13: కారుణ్యంతో సింగరేణిలో యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయని, వచ్చిన ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వహించి, క్రమశిక్షణతో పనిచేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో 13మందికి కారుణ్య ఉద్యోగాల నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగాల్లోకి చేరుతున్న యువకులు లైట్ జాబ్ కోసం ప్రయత్నాలు చేయవద్దని, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటి వరకు 3586మందికి, సింగరేణి వ్యాప్తంగా 12,446 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్వోటూజీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, ఏఐటీయూసీ నాయకులు ముస్కె సమ్మయ్య, కొమురయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ స